# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 297 | వరంగల్ | సోమవారం, 31 ఆగస్టు 2026 | పేజీలు: 6




కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఇచ్చిన హామీలు, అమలులో వైఫల్యాలు, ప్రజా సమస్యలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ సమరభేరికి సిద్ధమైంది. సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విస్తృతంగా వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ 'బూటకపు పాలన'ను ప్రజల ముందు ఎండగట్టాలని మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్‌భాస్కర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు దాస్యం వినయ్‌భాస్కర్ దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను ప్రజలకు మరోసారి గుర్తుచేసి.. వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రతి వర్గానికి వివరించాలని సూచించారు.


*- అక్షరశక్తి, హనుమకొండ*

# కాంగ్రెస్ వైఫల్యాలపై సమరభేరి!

## సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు బీఆర్ఎస్ పోరుబాట

- 6 గ్యారెంటీలు.. 420 హామీలపై ప్రజల్లోకి..
- 'బాకీ కార్డుల'తో కాంగ్రెస్ మోసాలను ఎండగడతాం
- వరంగల్ పశ్చిమలో వినూత్న నిరసన కార్యక్రమాలు
- పార్టీ శ్రేణులకు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపు

2



# సెప్టెంబరు 2న పెద్ది యాది సభ






- సెప్టెంబరు 2న కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహణ
- సభను విజయవంతం చేయాలి
- ఉద్యమకారులు, రాజకీయ, కుల సంఘాలు, జేఏసీలకు ఆహ్వానం
- తెలంగాణ పూర్వ జేఏసీ నేతల పిలుపు

4



## భూముల రీ సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**అక్షరశక్తి, హనుమకొండ:** జిల్లాలోని గ్రామాలలో చేపట్టిన భూ రీ సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని భూములు కొలతలు శాఖ కార్యాలయంలో జిల్లాలోని 70 గ్రామాలలో చేపట్టిన రిసర్వే వివరాలను సాఫ్ట్వేర్ లో నమోదు చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల రీ సర్వే ను 5 దశల్లో చేపట్టిన వివరాలను భూములు, కొలతలు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డీఐ సారంగ పాణి తెలిపారు. రీసర్వే లో ముందుగా గ్రామ సరిహద్దు నిర్ధారణకు సర్వే, గ్రామకంఠం సరిహద్దుల సర్వే, ప్రభుత్వ కాలువలు రోడ్లు శిఖం భూముల సర్వే, ప్రభుత్వ ఆస్తులు, పాఠశాలలు, ఆసుపత్రులు, అసన్ చేసిన భూముల రీ సర్వే, పట్టాదారు భూముల రీ సర్వేను చేపట్టినట్లు కలెక్టర్ కు వివరించారు. ఈ సర్వే కు సంబంధించి డేటాను సాఫ్ట్వేర్ లో క్షేత్రస్థాయిలో భూముల రీ సర్వే వివరాలను, ల్యాండ్ పార్సల్ మ్యాప్స్ (ఎల్పిఎం) సిద్ధం చేస్తున్నారా అని కలెక్టర్ అడిగారు. రైతుల వారీగా పాలిగన్ మ్యాప్ ల నమోదు చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భూముల రీ సర్వే సమగ్ర వివరాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా సర్వేయర్లు స్టాలిన్, విజయ్, సుజాత, తదితరులు ఉన్నారు.

## మైనారిటీ యువతకు గ్రూప్–1, 2, 3, 4 ఉచిత ఫౌండేషన్ కోచింగ్

**అక్షరశక్తి, మహబూబాబాద్:** మైనారిటీ వర్గాలకు చెందిన విద్యావంతులైన యువత కోసం తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్-1, 2, 3, 4 పరీక్షలకు ఉచిత జనరల్ స్టడీస్ ఫౌండేషన్ కోచింగ్ అందించనున్నట్లు మహబూబాబాద్ ఇన్‌చార్జి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.ఏ.వి. నాగలక్ష్మి తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీలు, బౌద్ధ మైనారిటీ వర్గాలకు చెందిన బీపీఎల్ కుటుంబాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు, సెప్టెంబర్ 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, మొత్తం 100 మంది అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డు, అన్ని విద్యా ధ్రువపత్రాలు డిజిటల్ స్కానింగ్ కోసం సమర్పించడంతో పాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలని అధికారి సూచించారు. రిజిస్ట్రేషన్, కోచింగ్ హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 04023236112, 9059050062 నంబర్లను లేదా directormscctelangana@gmail.com ఈమెయిల్‌ను సంప్రదించాలని, అన్ని పనిదినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమాచారం పొందవచ్చని తెలిపారు.

## బీసీలకు సబ్సిడీ రుణాలు అందించాలి

**అక్షరశక్తి,హైదరాబాద్:** బీసీలకు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయకుమార్ ఆరోపించారు. గతేడాది రాజీవ్ యువ వికాసం ద్వారా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ, ఇప్పటివరకు రుణాలు అందించలేదన్నారు. బీసీ నిరుద్యోగ యువత, కులవృత్తులపై ఆధారపడిన వారికి వెంటనే సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.






# కాంగ్రెస్ వైఫల్యాలపై సమరభేరి!

- సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు బీఆర్ఎస్ పోరుబాట
- 6 గ్యారెంటీలు.. 420 హామీలపై ప్రజల్లోకి..
- 'బాకీ కార్డుల'తో కాంగ్రెస్ మోసాలను ఎండగడతాం
- వరంగల్ పశ్చిమలో వినూత్న నిరసన కార్యక్రమాలు
- పార్టీ శ్రేణులకు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపు

**అక్షరశక్తి, హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఇచ్చిన హామీలు, అమలులో వైఫల్యాలు, ప్రజా సమస్యలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ సమరభేరికి సిద్ధమైంది. సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విస్తృతంగా వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ 'బూటకపు పాలన'ను ప్రజల ముందు ఎండగట్టాలని మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్‌భాస్కర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు దాస్యం వినయ్‌భాస్కర్ దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను ప్రజలకు మరోసారి గుర్తుచేసి.. వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రతి వర్గానికి వివరించాలని సూచించారు.

**హామీలన్నీ ఏమయ్యాయి?**

ఎన్నికల ముందు అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించిందని వినయ్‌భాస్కర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత, పేదలు, వివిధ వృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు.

**'బాకీ కార్డుల'తో ఎండగడతాం**

కాంగ్రెస్ పార్టీ ఆయా వర్గాలకు ఇచ్చిన హామీలు, వాటికి సంబంధించిన బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని వినయ్‌భాస్కర్ సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమిటి? ఇప్పటివరకు అమలు చేసినది ఎంత? ఇంకా బాకీ ఉన్నది ఎంత? అనే అంశాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని అన్నారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో ప్రజల ముందు ఉంచాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రతి రంగంలో వైఫల్యాలను ప్రజలకు చెప్పాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్ని రంగాల్లో విఫలమైందో ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందని వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రతి వర్గానికి సంబంధించిన సమస్యలను గుర్తించి, ఆయా వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకుని పోరాట కార్యక్రమాలను రూపొందించాలని అన్నారు.

**వరంగల్ పశ్చిమలో వినూత్నంగా..**

సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని దాస్యం వినయ్‌భాస్కర్ పార్టీ నాయకులను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యం, అవినీతి, పాలనా వైఫల్యాలను విస్తృతంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. ప్రజల నుంచి స్పందన వచ్చేలా కార్యక్రమాలను నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

### 'మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి'

"420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచుతోంది. ఈ మోసాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి" అని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. "వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం ఎన్ని రంగాల్లో వైఫల్యం చెందిందో.. ఎన్ని రంగాల్లో అట్టర్‌ఫ్లాప్ పరిపాలన సాగించిందో ప్రజలకు గుర్తు చేయాలి. హామీల అమలులో వైఫల్యాలను ఎత్తిచూపడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలి. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో వినూత్న కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి." అని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ ప్రెసిడెంట్లు, లీగల్ సెల్ బాధ్యులు, మహిళా డివిజన్ ప్రెసిడెంట్లు, విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మిషనరీ చర్చి భూములను పరిరక్షించాలి

**అక్షరశక్తి, హనుమకొండ:** మిషనరీ చర్చికి చెందిన భూములను పరిరక్షించాలని, వాటిలో ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి హనుమకొండ కమిటీ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం చర్చి ప్రాంగణం నుంచి అశోక జంక్షన్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మిషనరీ చర్చి భూములను వ్యక్తిగత, ఆర్థిక ప్రయోజనాల కోసం వినియోగించరాదని నిరసనకారులు నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ బాధ్యులు మాట్లాడుతూ, ఏపీ హైకోర్టు పరిధిలో ఉన్న మిషనరీ చర్చి భూముల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. చర్చి భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారంటూ మండల శ్రీనివాస్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిషనరీలు, చర్చి సేవా కార్యక్రమాలకు సంబంధించిన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. చర్చి ఆస్తులపై ఎలాంటి అక్రమ కార్యకలాపాలు, ఆక్రమణలు లేదా నిర్మాణాలు జరగకుండా సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.జె. నిరంజన్ బాబు,




ప్రెసిడెంట్ టి. క్రీస్టాఫర్ రూబెన్, సెక్రటరీ జి. విజయ్ స్వరూప్, ఉపాధ్యక్షులు విద్యాకర్, టి. మోజెస్ క్రిస్టాఫర్, ట్రెజరర్ బి. విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీలు జె. డానియేలు, జాన్సన్ ప్రసాద్, మత విశ్వాసకులు బోడ డిన్న, డా. పులి అనిల్ కుమార్, పాస్టర్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ ఎల్ ఎన్..... విద్యకు బలమైన పునాది







తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థలో ప్రస్తుతం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) కార్యక్రమం కీలకంగా కొనసాగుతోంది. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, లెక్కించడం వంటి మౌలిక సామర్థ్యాలను పెంపొందించడమే FLN ప్రధాన లక్ష్యం. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, సంచాలకురాలు యోగితా రాణా సూచించినట్లుగా ప్రతి ఉపాధ్యాయుడు FLNను తన బోధనలో అంతర్భాగంగా చేసుకొని విద్యార్థులకు బలమైన విద్యా పునాదులు అందించాలి. జాతీయ విద్యా విధానం-2020లోనూ ప్రాథమిక స్థాయిలో ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీకి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణలో 2022 నుంచి 'తొలి మెట్టు' వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

**అభ్యసన సామర్థ్యాల్లో గణనీయమైన పురోగతి...**

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన నివేదిక ప్రకారం విద్యార్థుల సామర్థ్యాల్లో గణనీయమైన పురోగతి నమోదైంది. తెలుగు చదవగలిగే విద్యార్థుల సంఖ్య 9 శాతం నుంచి 35 శాతానికి, ఇంగ్లీష్ పఠన సామర్థ్యం 4 శాతం నుంచి 29 శాతానికి, ఉర్దూ పఠన సామర్థ్యం 19 శాతం నుంచి 40 శాతానికి పెరిగింది. గణితంలో విద్యార్థుల సామర్థ్యం 18 శాతం నుంచి 43 శాతానికి, కూడికలు, తీసివేతల్లో 10 శాతం నుంచి 30 శాతానికి మెరుగుపడింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 5,311 పాఠశాలలను FLN సమర్థ పాఠశాలలుగా గుర్తించి, 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో సుమారు 47 శాతం మందిని ఈ కార్యక్రమం పరిధిలోకి తీసుకువచ్చారు. దాదాపు 24 వేల ప్రభుత్వ పాఠశాలల్లోని 10.34 లక్షల మంది విద్యార్థులకు FLNను చేరువ చేస్తూ, 60 వేల మంది ప్రాథమిక ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

బేస్‌లైన్ నుంచి ఎండ్‌లైన్ వరకు లక్ష్యబద్ధమైన బోధన: FLN అమలులో భాగంగా విద్యా సంవత్సరం ప్రారంభంలో బేస్‌లైన్ పరీక్ష నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను గుర్తిస్తారు. ఫలితాల ఆధారంగా పాఠ్య ప్రణాళికలను రూపొందించి వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి ప్రతిరోజూ సుమారు గంటపాటు రెమిడియల్ తరగతులు నిర్వహిస్తారు. మెరుగైన సామర్థ్యాలు చూపిన విద్యార్థులను మరో బృందంగా విభజించి వారు 100 శాతం సామర్థ్యాలు సాధించేలా బోధిస్తారు. అక్టోబర్‌లో నిర్వహించే మిడ్‌లైన్ పరీక్ష నాటికి నిర్దేశిత లక్ష్యాలను సాధించడంతో పాటు, ఫిబ్రవరి లేదా మార్చిలో జరిగే ఎండ్‌లైన్ పరీక్ష నాటికి కనీసం 80 శాతం మంది విద్యార్థులు నిర్దేశిత సామర్థ్యాలను సాధించేలా పాఠశాలలు పనిచేయాల్సి ఉంటుంది. FLN అమలును జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, పాఠశాల స్థాయిల్లో సమీక్షిస్తారు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ యాప్‌ల ద్వారా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయడం, అభ్యసనాన్ని సులభతరం చేయడం వంటి చర్యలు కూడా చేపడుతున్నారు.

**ఉపాధ్యాయులపై పెరుగుతున్న అదనపు బాధ్యతలు....**

జాతీయ విద్యా విధానం-2020లోని 5+3+3+4 విధానానికి అనుగుణంగా పూర్వ ప్రాథమిక విద్యతో పాటు 1, 2 తరగతులను పునాది దశగా తీసుకొని, అనంతరం 3, 4, 5 తరగతులు, 6, 7, 8 తరగతులు, 9 నుంచి 12 తరగతుల వరకు విద్యను వివిధ దశల్లో నిర్వహిస్తున్నారు. అయితే FLNతో పాటు విద్యార్థుల నమోదు, బడిబాట, ఆధార్-అపార్ నమోదు, ఎఫ్ఆర్ఎస్, మధ్యాహ్న భోజన వివరాల ఆన్‌లైన్ నమోదు, యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ వివరాలు, పాఠశాల పరిశుభ్రతకు సంబంధించిన యాప్‌లలో ఫొటోలు అప్‌లోడ్ చేయడం, 'ఏక్ పేడ్ మా కే నామ్', తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాల వివరాలు, హాజరు, డ్రాపౌట్ల నియంత్రణ, ఆన్‌లైన్ పరీక్షల నివేదికలు వంటి అనేక బాధ్యతలు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై ఉన్నాయి. దీంతో ముఖ్యమైన బోధన-అభ్యసన ప్రక్రియకు తగినంత సమయం కేటాయించడం కష్టంగా మారుతోంది. ముఖ్యంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది.

**మౌలిక వసతులతో పాటు మానవ వనరులు అవసరం...**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'మన ఊరు-మన బడి' కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. పీఎం శ్రీ పథకం ద్వారా కూడా ఎంపికైన పాఠశాలల్లో సదుపాయాలు మెరుగుపడ్డాయి. మధ్యాహ్న భోజన పథకం, ప్రస్తుతం అందిస్తున్న అల్పాహారం వంటి కార్యక్రమాలు విద్యార్థుల హాజరును పెంచడంలో, డ్రాపౌట్లను తగ్గించడంలో సహాయపడుతున్నాయి. అయితే పాఠశాల భవనాలు, సాంకేతిక సదుపాయాలతో పాటు తగినంత మంది ఉపాధ్యాయులు ఉండటం అత్యంత అవసరం. దేశవ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు పెద్ద సంఖ్యలో ఉండటం, కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గడం ఆందోళన కలిగించే అంశాలు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరుగుతున్న పరిస్థితి ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దానికి అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు - ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు: FLN లక్ష్యాలను విజయవంతంగా సాధించాలంటే కేవలం పరీక్షలు, యాప్‌లు, లక్ష్యాలు సరిపోవు. ప్రతి తరగతికి కనీసం ఒక ఉపాధ్యాయుడు, ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. విద్యాహక్కు చట్టం-2009 స్ఫూర్తికి అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు చేపట్టి, బోధనకు తగిన సమయం, వాతావరణం కల్పించాలి. ఒకే ఉపాధ్యాయుడిపై బోధనతో పాటు అనేక పరిపాలనా, ఆన్‌లైన్ బాధ్యతలను మోపకుండా చూడాలి. నాడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ "మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను" అని పిలుపునిచ్చారు. నేటి మాటగా— "మీరు మాకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని, ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడిని ఇవ్వండి.. మేము మీకు విద్యలో ప్రగతిని చూపిస్తాము." నాణ్యమైన ప్రాథమిక విద్యే బలమైన భవిష్యత్తుకు పునాది. FLN లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తూ తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలవాలని ఆశిద్దాం.



**- యాస్మీన్ జహాన్**
**ఎంపీపీఎస్ కాశగూడెం**
**ధర్మసాగర్**



## విజయవంతంగా చిత్ర కళా ప్రదర్శన

**కళా యజ్ఞ మినీ కి విశేష స్పందన**

**అక్షరశక్తి ,హనుమకొండ:** నగరానికి చెందిన సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జూలై నెలలో ప్రారంభించి 14 రోజుల పాటు 7 ప్రత్యేక అంశాల పైన జాతీయ స్థాయిలో కళా యజ్ఞ పేరుతో ఆర్ట్ చాలా నిర్వహించగా దేశం నలుమూలల నుంచి 50+ కి పై ఆర్టిస్టులు పాల్గొని 350 కి పైగా చిత్రాలు వేయగా వాటిల్లో నుండి ప్రతి ఒక్కరికి సంబంధించిన ఒక ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసి, వాటితో నిన్న హైదరాబాద్ లోని ఫైన్ ఆర్ట్స్ కళాశాల నెహ్రూ ఆర్ట్ గ్యాలరీ లో చిత్ర కళా ప్రదర్శన ఏర్పాటు చేయగా బి సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ప్రారంభోత్సవం చేయగా, ప్రముఖ సినిమా దర్శకులు శివ నాగేశ్వర రావు, ప్రముఖ రచయిత బ్నిం ఆర్టిస్టులకు సన్మానం చేయడం తో విజయవంతంగా ముగిసింది... ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ డా.సాగంటి మంజుల తో పాటు.. ప్రముఖ చిత్రకారులు డాకోజు శివప్రసాద్, చిత్ర, జయశ్రీ ప్రభాకర్, చిప్పకుర్తి శ్రీనివాస్, దార్ల నాగేశ్వర రావు, దుర్గారావు , 50+ పాల్గొన్న చిత్రకారులు, వందల మంది చిత్ర కళా ప్రియులు పాల్గొన్నారు.

## వేయి స్తంభాల దేవాలయంలో ఎమ్మెల్యే నాయిని దంపతుల ప్రత్యేక పూజలు



**అక్షరశక్తి,హనుమకొండ:** శ్రావణ బహుళ తృతీయ సోమవారం, సంకట చతుర్థి సందర్భంగా చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, శ్రీమతి నీలిమ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మ ముహూర్తంలో సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవల్లో పాల్గొని ఉద్దిష్ట గణపతికి ఆవుపాలు, పెరుగు, పంచామృతాలతో అభిషేకం చేశారు. సర్వగ్రహ దోష నివారణ, ప్రజల సుఖసంతోషాలను ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు, నీరాజనం, మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం శివునికి రుద్రాభిషేకం, రుద్రాధ్యాయం నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంబంధిత శాఖల సహకారంతో వేయి స్తంభాల దేవాలయం దినదినాభివృద్ధి చెందుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆలయం చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, పనులు పూర్తయితే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. గార్డెన్ నిర్వహణను కూడా నిరంతరం మెరుగ్గా చేపట్టాలని సూచించారు. తృతీయ సోమవారం సందర్భంగా శివభక్తులు, దాతల సహకారంతో పేద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రుద్ర సేవా సమితి సభ్యులు పులి రజనీకాంత్, వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరశక్తి, గూడూరు:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి రాథోడ్ సూచించారు. గూడూరు మండలం తీగలవేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ కార్యక్రమాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఎన్‌సీడీ స్క్రీనింగ్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం పీహెచ్‌సీలో జరుగుతున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. 14-15 సంవత్సరాల బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచించారు. ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు, సూపర్‌వైజర్ శానుబేగం, గణేష్, ఫార్మసిస్ట్ అమల, ల్యాబ్ టెక్నీషియన్ మధుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

**అక్షరశక్తి,హనుమకొండ:** విద్యుత్ వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వివిధ సర్కిళ్లలో వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరం ఆధ్వర్యంలో లోకల్ కోర్టులు నిర్వహించనున్నట్లు ఫోరం చైర్‌పర్సన్ జి. నాగప్రసాద్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ లోకల్ కోర్టుల్లో విద్యుత్ సరఫరా అంతరాయాలు, హెచ్చు తగ్గులు, మీటర్ల సమస్యలు, బిల్లుల్లో లోపాలు, కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, సంస్థ అందించాల్సిన సేవల్లో ఆలస్యం తదితర సమస్యలపై వినియోగదారులు నేరుగా ఫిర్యాదులు సమర్పించి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. లోకల్ కోర్టుల షెడ్యూల్‌లో భాగంగా సెప్టెంబర్ 2న జనగాం సర్కిల్‌లోని దేవరుప్పుల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో, సెప్టెంబర్ 8న వరంగల్ సర్కిల్‌లోని నల్లబెల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కోర్టులు నిర్వహించనున్నారు. అలాగే సెప్టెంబర్ 17న మహబూబాబాద్ సర్కిల్‌లోని మునగాలవీడు సబ్‌స్టేషన్‌లో, సెప్టెంబర్ 18న భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్‌లోని దుమ్ముగూడెం సబ్‌స్టేషన్‌లో, సెప్టెంబర్ 22న పెద్దపల్లి సర్కిల్‌లోని అంతేర్గం సబ్‌స్టేషన్‌లో లోకల్ కోర్టులు జరుగుతాయి. సంబంధిత ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులతో హాజరై పరిష్కారం పొందాలని ఫోరం చైర్‌పర్సన్ సూచించారు.

## పోలీసు అధికారులకు ఘన వీడ్కోలు

- పదవీ విరమణ పొందిన ఐదుగురు అధికారులు, సిబ్బందికి సన్మానం



**అక్షరశక్తి, భూపాలపల్లి:** సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో పదవీ విరమణ పొందుతున్న వారికి జ్ఞాపికలు అందజేశారు. పదవీ విరమణ పొందిన వారు: ఎస్. ఈశ్వరయ్య - ఎస్సై2, చిట్యాల పోలీస్‌స్టేషన్, ఎన్. సత్యనారాయణరావు - ఎస్సై2, ఘణపురం పోలీస్‌స్టేషన్, పి. రవికుమార్ - ఏఆర్‌ఎస్ఐ, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, భూపాలపల్లి, సిహెచ్. కుమారస్వామి - ఏఎస్ఐ, ఎస్బీ, భూపాలపల్లి, పి. అశోక్ - హెడ్ కానిస్టేబుల్, పీసీఆర్, భూపాలపల్లి. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజమని, ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా సుదీర్ఘ కాలం పోలీసు శాఖకు సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు విజయవంతంగా విధులు నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బంది పోలీసు శాఖకు అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని, వారి అనుభవాలు శాఖకు విలువైనవని అన్నారు. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, భూపాలపల్లి సీఐ శ్రీనివాస్, పోలీసు సంఘం అధ్యక్షుడు నరేష్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సెప్టెంబరు 2న పెద్ది యాది సభ





- సెప్టెంబరు 2న కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహణ
- సభను విజయవంతం చేయాలి
- ఉద్యమకారులు, రాజకీయ, కుల సంఘాలు, జేఏసీలకు ఆహ్వానం
- తెలంగాణ పూర్వ జేఏసీ నేతల పిలుపు

**అక్షరశక్తి, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమకారుడు, అమరుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి యాదిలో సెప్టెంబరు 2న నిర్వహించనున్న యాది సభను విజయవంతం చేయాలని తెలంగాణ పూర్వ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యమకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, జేఏసీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. సెప్టెంబరు 2వ తేదీ బుధవారం సాయంత్రం 3 గంటలకు కాళోజీ కళాక్షేత్రంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి యాది సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమంలో ఆయన చేసిన సేవలు, పోరాట స్ఫూర్తిని స్మరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యాది సభకు ఉద్యమకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, జేఏసీల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి పోషించిన పాత్రను స్మరించుకోవడంతో పాటు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అడ్వకేట్ జేఏసీ నాయకుడు అడ్వకేట్ అబ్దుల్ నబీ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆకాంక్ష వేదిక, జేఏసీ నాయకుడు రేపల్లె నరోత్తమసూరి, రిటైర్డ్ ప్రొఫెసర్ సిఎస్. దినేష్‌కుమార్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు యాదవరెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు పాముల వెంకటరాముడు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు నున్న అప్పారావు, కాకతీయ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సాధు రాజేష్, లంబాడి హక్కుల పోరాట సమితి, తెలంగాణ ట్రైబల్ జేఏసీ నాయకుడు జైసింగ్ రాథోడ్, గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, కేయూ లెక్చరర్ మంద వీరస్వామి, జేఏసీ నాయకుడు డాక్టర్ సూత్రపు అనిల్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకుడు భిక్షపతి నాయక్, లెక్చరర్ డాక్టర్ ఫిరోజ్, అడ్వకేట్ డాక్టర్ వల్లివుల్లా ఖాద్రి, కేయూజేఏసీ నాయకుడు నీలం రాజకిషోర్, కేయూ లెక్చరర్ డాక్టర్ సురాసికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

**రాష్ట్ర రాజధానిలో మహిళలకు రక్షణ లేదా?**



**అక్షరశక్తి, కొత్తగూడ :** హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఆదివాసీ యువతి ఊకే శిరీష మృతిపై సమగ్ర, నిష్పక్షపాత, పారదర్శక దర్యాప్తు జరిపించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష హైదరాబాద్ మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలోని ప్రైమ్‌కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారని నాయకులు తెలిపారు. రాఖీ పండుగ రోజు విధులు ముగించుకుని నివాసానికి వెళ్లిన అనంతరం జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. రాష్ట్ర రాజధానిలో మహిళలకు, ముఖ్యంగా ఇతర జిల్లాల నుంచి వచ్చి ఉద్యోగాలు చేస్తున్న ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శిరీష మృతికి సంబంధించి షానదుల్లా ఖాన్‌పై వచ్చిన ఆరోపణలపై ఎలాంటి పక్షపాతం లేకుండా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. నేరం రుజువైతే చట్టప్రకారం కఠిన శిక్ష విధించాలని కోరారు. ఆసుపత్రి యాజమాన్యం ఉద్యోగుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిందా అనే అంశంపైనా ప్రత్యేక విచారణ జరపాలని అన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు.. ఆదివాసీ ఆడబిడ్డల భద్రత కోసం ఉద్యమిస్తాం.. ఊకే శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గం.. అని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసం నాగేశ్వర్‌రావు, పూనెం సందీప్‌కుమార్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు మల్లెల సారయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఈసం వెంకన్న, తుర్స అనిల్, మోకాళ్ల ప్రశాంత్, ఆదివాసీ ఉద్యోగ సంఘ బాధ్యుడు బంగారి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మామునూరు ఓపెన్ ఎయిర్ జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి పూజ

**అక్షరశక్తి,వరంగల్:** వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కందుకూరి పూజ మామునూరు ఓపెన్ ఎయిర్ జైలును సందర్శించారు. జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించి ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బ్యారక్‌లను పరిశీలించి ఖైదీలతో మాట్లాడి వారి కేసుల స్థితిగతులు, న్యాయపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యూ లైఫ్ సొసైటీ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించి చిన్నారుల రికార్డులు, వసతి, పరిశుభ్రత, భద్రత, ప్రాథమిక సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులకు



అవసరమైన అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కళా సాగర్, జైలర్లు పూర్ణచందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యతతోనే హక్కుల సాధన

- మల్లంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి నూతన పాలకవర్గం



**అక్షరశక్తి, దుగ్గొండి:** ముదిరాజుల హక్కులు, మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు పొన్నం మొగిలి ముదిరాజ్ అన్నారు. ఐక్యతతో కలిసి ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మల్లంపల్లిలో మత్స్య పారిశ్రామిక శ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గ అభినందన సభను జిల్లా నాయకుడు తాళ్ల రవీందర్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి పొన్నం మొగిలి ముదిరాజ్ ముఖ్య అతిథిగా, ఎన్‌ఆర్ఐ రాష్ట్ర ముదిరాజ్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ ముదిరాజ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని శాలువాలతో సత్కరించి అభినందించారు. నూతన పాలకవర్గం: అధ్యక్షుడు: సోడా సమ్మయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షుడు: పాండవుల శ్రీనివాస్ ముదిరాజ్, కార్యదర్శి: ఈర్ల కొమ్మాలు ముదిరాజ్, డైరెక్టర్లు: సోడా వేణు ముదిరాజ్, ఈర్ల రమేష్ ముదిరాజ్, భూమ నర్సయ్య ముదిరాజ్, ఈర్ల రాజు ముదిరాజ్, లక్క మహేందర్ ముదిరాజ్, మొద్దు వీరన్న ముదిరాజ్. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పల్లె రమేష్ ముదిరాజ్, మండల ఉపాధ్యక్షుడు ఓరంగంటి తిరుపతి ముదిరాజ్, మాజీ మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు ఈర్ల నరేష్ ముదిరాజ్, కుల పెద్దలు పాండవుల రామకృష్ణ ముదిరాజ్, ఈర్ల సారయ్య ముదిరాజ్, సోడా శ్రీధర్ ముదిరాజ్, ఈర్ల రాజు చిన్న ముదిరాజ్, తెప్ప సుమన్ ముదిరాజ్, తెప్ప పైడి, భూమ రవి ముదిరాజ్, ఏళ్ల స్వామి ముదిరాజ్, ఈర్ల పెద్ద కొమ్మాలు ముదిరాజ్, మొద్దు కిషోర్ ముదిరాజ్ తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 2న పరకాలకు బీజేపీ రాష్ట్ర చీఫ్

- అమరధామంలో నివాళులర్పించనున్న ఎన్. రామచంద్రరావు



**అక్షరశక్తి, పరకాల:** అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సెప్టెంబరు 2న పరకాలలో నిర్వహించనున్న సంస్మరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘన నివాళులు అర్పించేందుకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పరకాలకు రానున్నారు. అమరధామంలో అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో సోమవారం పరకాలలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. దేశం, ప్రజల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగాలు చేసిన అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. వారి త్యాగస్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సంస్మరణ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమరవీరులకు నివాళులర్పించాలని కోరారు. సమావేశంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజ్ పురోహిత్ జయంతిలాల్, దేవునూరి మేఘనాథ్, పరకాల మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయకుమార్, జిల్లా కోశాధికారి రామన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కాచం గురుప్రసాద్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు పైండ్ల రంజిత్, పట్టణ కార్యదర్శి దంచనాదుల కిరణ్, నాయకులు దంచనాదుల సత్యనారాయణ, కానుగుల గోపీనాథ్, మెంతుల సురేష్, పిట్ట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

**అక్షరశక్తి, భూపాలపల్లి:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 13 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ.. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీసు శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు.



## ముద్దునూరులో పెద్ది సుదర్శరెడ్డికి ఘన నివాళి






**అక్షరశక్తి, నర్సంపేట :** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలంలోని ముద్దునూరు గ్రామంలో ఆదివారం రాత్రి బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటం వద్ద, పూలు, కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో మహా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని, స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించారని అన్నారు. ఎమ్మెల్యేగా నర్సంపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. ముద్దునూరు గ్రామాన్ని కూడా చాలా అభివృద్ధి చేశారని అన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా పెద్ది సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, అన్నివర్గాల ప్రజల్లో గుండెల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు. పెద్ది మృతి నర్సంపేట నియోజకవర్గానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పోతుల అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ రేవూరి సురేందర్‌రెడ్డి, జక్కుల స్వామి, బొల్లెపల్లి రాజు, కర్ణాకర్, రఘు, మహేందర్, రమేష్, శ్రీను, మొగిలి, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టు ఓదెల శివకుమార్‌కు నిత్యావసర సరుకుల అందజేత

**అండగా నిలిచిన 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి**



**అక్షరశక్తి, పరకాల :** పరకాల పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఓదెల శివకుమార్ కు 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం నిత్యావసర సరుకులను అందజేశారు. ఇటీవల శివకుమార్ తండ్రి భిక్షపతి మరణించిన విషయం తెలుసుకున్న కౌన్సిలర్ పూర్ణచారి స్పందించి, తనవంతు సహాయంగా నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. జర్నలిస్టులు సమాజంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్ట్ శివకుమార్ కుటుంబానికి అవసరమైన సమయంలో తనవంతు సహాయ సహకారం అందించినట్లు, కష్టకాలంలో అందించే చిన్న సహాయం కూడా బాధిత కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులు అందించిన కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారికి జర్నలిస్ట్ శివకుమార్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు స్పందించి తమ కుటుంబానికి అండగా నిలవడం పట్ల వారు ధన్యవాదాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మరాటి నర్సింగ్, ఘంటారావం రవీందర్, క్యాతం రమేష్, విజయేందర్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం





**అక్షరశక్తి, హన్మకొండ :** లయన్స్ క్లబ్ ఆఫ్ హెచ్ఎన్కే న్యూ శాయంపేట ఆధ్వర్యంలో న్యూ శాయంపేటలోని గ్రీన్ ఫీల్డ్ స్కూల్లో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ లయన్ ఎన్. సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. కంటి వైద్య నిపుణులు డా. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ వి. శ్యామ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జె. అశోక్ రెడ్డి, సెక్రటరీ ఎండి. ఉస్మాన్ పాషా, ట్రెజరర్ జూకంటి శ్రీనివాస్ (వాసు), జిల్లా కాంగ్రెస్ పీసీ మెంబర్ మామిండ్ల సురేష్ తో పాటు లయన్ సభ్యులు వలి మహమ్మద్, సురేందర్, నాగరాజు, జి. దశరథం, సోమన్న, రజనీకాంత్, కొల్లూరి కృష్ణ, ఇ. ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

## ‘వసుధైవ కుటుంబకం’ మాటకు పరీక్ష అమెరికాలో కాదు,

# భారత్ లోనే! కనిపించాలి



న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆగస్టు 29న జరిగిన ‘యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్’లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ చేసిన ప్రసంగం ఒక సాధారణ ప్రవాస భారతీయుల కార్యక్రమం కంటే ఎక్కువ రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ (ఏహెచ్ఈఏడీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 5,000–6,000 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. 250కిపైగా హిందూ-అమెరికన్ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని నిర్వాహకుల సమాచారం.

భగవత్ ప్రసంగంలోని ప్రధాన సందేశం “వసుధైవ కుటుంబకం”— ప్రపంచమంతా ఒకే కుటుంబం. అనే భారతీయ తాత్విక భావన. భారతదేశం, అమెరికా రెండింటి సామాజిక స్వభావంలో వైవిధ్యంలో ఏకత్వం ఉందని ఆయన అన్నారు. ధర్మం అంటే కేవలం మతాచారం కాదని, వ్యక్తి తనకంటే సమాజం, మానవత్వం, ప్రకృతి పట్ల బాధ్యతను నిర్వర్తించడమే ధర్మమని ఆయన వివరించారు. ముఖ్యంగా “భారతదేశంలో ముస్లింలు ఉండకూడదని భావించే వ్యక్తి నిజమైన హిందువు కాదు” అన్న ఆయన వ్యాఖ్య గమనించదగ్గది. అన్ని మతాల మార్గాలు వేర్వేరైనా మానవత్వం, సత్యం ఒకటేనన్న సందేశాన్ని ఆయన ఇచ్చారు.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

ఇక్కడే ఈ ప్రసంగం అసలు రాజకీయ-సామాజిక పరీక్షను ఎదుర్కొంటుంది. “ప్రపంచం ఒక కుటుంబం” అనే మాట సార్వత్రిక మానవతా విలువగా ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ ఆ భావనను చెప్పే సంస్థకు సంబంధించిన చారిత్రక, రాజకీయ వివాదాలను విస్మరించడం కూడా సరైంది కాదు. ఆర్‌ఎస్‌ఎస్ 1925లో స్థాపించబడి 2025లో శతాబ్ది పూర్తి చేసుకుంది. భారతదేశంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీతో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఉన్న సైద్ధాంతిక సంబంధం అంతర్జాతీయంగా విస్తృతంగా చర్చించబడుతోంది. అందువల్ల భగవత్ అమెరికాలో చెప్పిన సమగ్రత సందేశాన్ని ఆయన సంస్థ భారతదేశంలోని సామాజిక-రాజకీయ వాస్తవాలతో పోల్చి చూడటం సహజమే.

అమెరికాలో ఈ కార్యక్రమానికి వచ్చిన వ్యతిరేకత కూడా అందుకే ప్రాధాన్యత పొందింది. న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని మైనారిటీలను వెలివేసే దృక్పథంగా విమర్శించారు. అమెరికా అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్ కూడా భగవత్ అమెరికా పర్యటన సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ, సంస్థకు సంబంధించిన వ్యక్తులపై లక్ష్యిత ఆంక్షలను సిఫారసు చేసింది. అయితే ఇవి అమెరికా ప్రభుత్వ తుది నిర్ణయాలు కావు; ఆర్‌ఎస్‌ఎస్ ఈ ఆరోపణలను తిరస్కరిస్తూ తాను సాంస్కృతిక, సేవా సంస్థ మాత్రమేనని చెబుతోంది.

అమెరికాలోని భారతీయ సమాజ పరిమాణాన్ని చూస్తే ఈ వాదోపవాదం మరింత ఆసక్తికరం. 2022 నాటికి అమెరికాలో సుమారు 48 లక్షల భారతీయ అమెరికన్లు ఉన్నారని ప్యూ రీసెర్చ్ సెంటర్ అంచనా. వారిలో 48 శాతం మంది హిందువులుగా తమను గుర్తించుకున్నారు. అంటే అమెరికాలో హిందూ సమాజం కేవలం ఆధ్యాత్మిక సమూహం మాత్రమే కాదు; ఆర్థిక, విద్యా, వృత్తి, రాజకీయ రంగాల్లో ప్రభావం పెంచుకుంటున్న ప్రవాస సమాజం.

అయితే భగవత్ ప్రసంగాన్ని కేవలం విమర్శలతో కొట్టిపారేయడం కూడా అంతే అసంపూర్ణం. మతాల మధ్య సంభాషణ, సేవ, పరస్పర గౌరవం, మానవ ఏకత్వం వంటి విలువలను బహిరంగంగా చెప్పడం స్వాగతించదగ్గ పరిణామమే. న్యూయార్క్‌లో ఆయన ఇస్కాన్ కార్యక్రమంలో పాల్గొని నిరాశ్రయులకు లక్ష భోజనాల కార్యక్రమంలో 1,00,000వ భోజన పంపిణీని ప్రారంభించడం కూడా సేవను ఆధ్యాత్మికతతో అనుసంధానించే ప్రయత్నంగానే చూడాలి.

కానీ అసలు ప్రశ్న ఒక్కటే—“వసుధైవ కుటుంబకం” నినాదం వేదికపై ఎంత అందంగా వినిపించిందన్నది కాదు; అది భారత్ లో సామాజిక జీవితంలో ఎంతవరకు ఆచరణలో కనిపిస్తుందన్నదే ప్రధాన అంశం. భారత రాజ్యాంగంలోని మత స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి విలువలు ప్రతి మతానికీ సమాన భద్రత కల్పించగలిగితేనే ప్రపంచానికి భారతదేశం నిజమైన “ఏకత్వంలో భిన్నత్వం” అనే మాటకు ఉదాహరణగా నిలుస్తుంది. అమెరికా వేదికపై ముస్లింలు భారతదేశంలో సమానంగా ఉండాలనే సందేశం చెప్పడం సానుకూలమే. కానీ అదే సందేశం భారతదేశంలోని ప్రతి గ్రామం, ప్రతి మతం, ప్రతి అల్పసంఖ్యాకుడి జీవితంలోనూ అనుభూతి కలిగిందా? అన్నదే కావాలి. అప్పుడు మాత్రమే “ప్రపంచం ఒక కుటుంబం” అనే మాట ఒక ప్రసంగంలోని ఆకర్షణీయమైన వాక్యం కాకుండా భారతీయ నాగరికత యొక్క జీవన సత్యంగా ప్రపంచం అంగీకరిస్తుంది. గత పన్నెండేళ్లలో భారత్ లో ఆరెస్సెస్, దాని రాజకీయ అనుభంధ సంస్థ బీజేపీ అనుసరించిన విధానాలు ఇప్పటికే చరిత్ర పుటల్లో లిఖించబడింది, మోహాన్ భగవత్ జీవిత చరమాంకంలో నిజమైన పరిపక్వత అనుభవంలో నుండి "ఉపదేశించిన ఈ ఆరెస్సెస్ , (బీజేపీ) ఆశయాలు" ఆచరణలో భవిష్యత్తులో అనుసరించ బోతున్న విధానాలు వాటికి భిన్నంగా ఉండబోతుందా అనేది వేచి చూడాలి.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.